క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. అమ్మవారి మూల విగ్రహానికి అంకురార్పణ, అభిషేకం, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఆలయ సమీపాన ఉన్న పాలబావి వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గంగ పూజను చేసి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు విందు భోజనాలు చేశారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీబాలాజీ విద్యా విహార్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. 21 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప పాల్గొని జాబ్‌మేళాను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 252 మంది పాల్గొనగా 137 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులతో పాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు చైతన్య, కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ముంబైకి చెందిన ద డ్రీమ్ సంస్థ ఈ నెల 2న కొట్నూరు పాఠశాలలో జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించింది. ప్రతిభ కనబరిచిన వారికి మంగళవారం ఆ పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో లక్ష్మీ , రెండోస్థానంలో కౌసల్య, మూడోస్థానంలో దనేంద్రాచారి, నాలుగో స్థానంలో చందన నిలవగా వారికి మెడల్స్, మెమొంటోలను అందజేశారు. అలాగే 31 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 150 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు.

వృత్తి విద్యకోర్సు సర్టిఫికెట్ల ప్రదానం

హిందూపురం: విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే కోర్సులను ఎంపిక చేసుకుని క్రమ శిక్షణతో చదువుకుని ముందుకు సాగాలని చర్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అశోక్ కుమార్ నాయక్ తెలియజేశారు. వృత్తి విద్యా కోర్సులలో భాగంగా 12 రోజులపాటు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు.

ఏఈ కార్యాలయం ప్రారంభం


విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఏఈ కార్యాలయాలన్ని మంగళవారం సాయంత్రం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర, కదిరి డివిజినల్ ఇంజనీర్ రామిరెడ్డి, స్థానిక ఏఈ బాలకృష్ణనాయక్ , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన పాస్టర్లు

పెనుకొండ: మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాస్ తో పాటు పలువురు పాస్టర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న పాస్టర్ల గౌరవ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలే కాదు. సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, జెరూసలేం యాత్ర తదితర వాటిని అమలు చేస్తామన్నారు.

భానుడి భగభగలు




మడకశిర మెయిన్‌రోడ్డులో జనం లేక నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత
- ఉక్కపోత, ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలు

మడకశిరరూరల్: భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉక్కపోత, వేడి గాలుల ప్రభావంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మాసంలోనే ఎండ తీవ్రత 40 డిగ్రీలను తాకుతుండటంతో మే నెల గురించి ఆలోచిస్తేనే బెంబేలెత్తిపోతున్నారు.

జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్

కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండలో తిరగకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకూ ఇళ్లు, చెట్ల కింద ఉండటం మంచిది. ఒక వేళ బయటికి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గొడుగు, టోపీలను ధరించాలి. మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు, నిమ్మరసం, కొబ్బరి నీరు, మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలి. వేసవిలో తెల్లని దుస్తులు ధరించాలి, బాగావదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరిస్తే మేలు. ముఖ్యంగా నల్లని దుస్తులు ధరించకూడదు. ఇంట్లో ఉన్న గదుల్లో ఉష్ణోగ్రతలు కొంత వరకూ తగ్గించుకునేందుకు కిటికీలు, తలుపులకు తెరలనువాడాలి. శరీరం నుంచి చమట రూపంలో ఎక్కువగా నీరు బయటకు వెళ్తుంది. కాబట్టి మంచినీరు ఎక్కువగా తాగాలి. నాలుగు లీటర్లపైగా నీటిని తాగితే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో పొలం పనులకు వెళ్లకుండా ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేసుకోవాలి.

బయటకు వెళ్లలేకపోతున్నాం



రోజురోజుకూ ఎండ తీవ్రత అధికమవుతుండటంతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేకపోతున్నాం. ఇంటి వద్ద, చెట్ల కింద సేదతీరుతున్నాం. అత్యవసరమైతే జాగ్రత్తలు తీసుకుంటూ బయటికి వెళ్లాల్సిన పరిస్థితి. రెండు మూడు రోజులు జల్లులతో కూడిన అకాల వర్షం పడడంతో మరింతగా వేడి ఉంది. వేకువజామున వెళ్లి వ్యవసాయ పనులు చేసుకొని ఉదయం 10 గంటల్లోపు ఇంటికి చేరుకుంటున్నాం.

– హనుమంతరాయప్ప, రైతు, గౌడనహళ్లి

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



గతం కంటే ఈసారి ఎండ తీవ్రత అధికంగా ఉంది. జీవన ఆహార శైలిలో మార్పులు తప్పక చేసుకోవాలి. సురక్షిత ప్రమాణాలు పాటించాలి. ఒక వేళ వడదెబ్బ తగిలితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి తక్షణం వైద్యం తీసుకోవాలి. వైద్యుల సూచనలతో ఐవీ ఫ్లూయిడ్స్ వాడాలి. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నాం.

– నరేష్‌కుమార్, డాక్టర్, కదిరేపల్లి పీహెచ్‌సీ



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	39.0
పెనుకొండ	42.0
మడకశిర	39.0

పోస్టుమాస్టర్‌పై ఫిర్యాదు

పెనుకొండ: ముదిగుబ్బ మండలం రాచువారిపల్లిలో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్‌పై చర్యలు తీసుకోవాలని బాబ్‌జాన్ అనే వ్యక్తి మంగళవారం పెనుకొండ ఐపీఏ విమల్‌కుమార్ వినతిపత్రం ఇచ్చారు. బాబ్‌జాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 13న తన మొబైల్ ఫోన్ స్టేటస్‌గా వైఎస్సార్‌సీపీ నాయకుల వీడియోలో ఉంచానన్నారు. ఈ నేపథ్యంలో పోస్టుమాస్టర్ షేక్ అబ్దుల్ ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా తనపై దాడి చేశాడన్నారు. దీనిపై ఇప్పటికే ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి దాడి చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. వెంటనే అబ్దుల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

మేడే విజయవంతం చేయండి

పెనుకొండ: మేడే వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ మేడేను ఘనంగా నిర్వహిస్తామని, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, కరణ్, మనీ, రాజు, ఇంద్ర, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత


వసంతకుమార్


రేవంత్


మనోజ్‌కుమార్‌రెడ్డి


మంజునాథ్

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నలుగురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వసంత కుమార్ 92.16 శాతం, పలమని రేవంత్ 84.98 శాతం, మనోజ్‌కుమార్‌రెడ్డి 82.87 శాతం, మంజునాథ్ 67.98 శాతం అర్హత సాధించారని పేర్కొన్నారు.


ఖాళీ బిందెలతో నిరసనకు దిగిన మహిళలు

తాగునీటి కోసం నిరసన

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని కురుబవాండ్లపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. కొద్దిరోజులుగా గ్రామంలో తాగునీటికి అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


నరసింహమూర్తి (ఫైల్)

అగళి: మండల పరిధిలోని కోడిపల్లిలో నరసింహమూర్తి (40) మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోడిపల్లిలో మారమ్మ పండుగ సందర్భంగా మహిళలు జ్యోతులను మోసుకుంటూ మారమ్మ గుడికి వస్తున్నారన్నారు. ఆ సమయంలోనే నరసింహమూర్తి కుప్పకూలి అక్కడే పడిపోయారన్నారు. హుటాహుటిన అగళి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

హిందూపురం: పేదలకు అన్నదానం, దాహార్తి కల్గిన వారందరికీ తాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో భాగ్యమని కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి మాతాంగ మహాపీఠం స్వామి ఆనందగిరి అన్నారు. సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ చౌక్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే రైల్వేరోడ్డులో అన్నదానం నిర్వహించారు. సద్గురు యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్, కౌన్సిలర్ రఘు, అనిల్, రాము, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో మంగళవారం జరిగిన వడిసిలమ్మ, గౌడచంద్ర మారెమ్మ జాతర ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు.

యువతి ఆత్మహత్య

గోరంట్ల: మండలంలోని గువ గంగంపల్లికి చెందిన ఎంసీఏ విద్యార్థిని మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. ఉరి వేసుకున్న ఆమెను గమనించిన బంధువులు వెంటనే గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

మంత్రి సవితకు కోర్టు ఉత్తర్వులు వర్తించవా?


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్


పార్టీ నాయకులతో కలిసి కాఫీ తాగుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ మాన్యం సర్వే నంబరు 73లోని భూమికి సంబంధించి హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించి అక్రమంగా టీడీపీ నాయకులు రోడ్డు వేయడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఇటీవల వేసిన రోడ్డును ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడారు. మంత్రి సవిత కోర్టు ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా కేవలం టీడీపీ నాయకుల స్వార్థప్రయోజనం కోసం నాలుగు ఇళ్లకు వెళ్లేందుకు బలవంతంగా రోడ్డు వేయించి గ్రామస్తుల మనోభావాల దెబ్బతీయడం బాధాకరమన్నారు. అధికారులు కూడా నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి గ్రామస్తులు వ్యతిరేకించిన రోడ్డు నిర్మాణానికి సహకరించడం కోర్టు ధిక్కారణ కింద వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాది కావస్తున్నా రైతులు, మహిళలు, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల వారిని సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. మున్సిపాల్టీ పాలకవర్గాల్లో టీడీపీకి మెజార్టీ లేకపోయినా దొడ్డి దారిలో చైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను బెదిరిస్తున్నారన్నారు. మైనార్టీలను టీడీపీ కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటోందని విమర్శించారు. ముస్లింలందరూ వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు విషయంలో కేంద్రానికి మద్దతు ఇచ్చి వారి మనోభావాలు దెబ్బతీసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచులు సోమశేఖర్, కిష్టప్ప, జిలాన్‌ఖాన్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ జితేంద్ర రెడ్డి, ఎస్సీసెల్ ఈశ్వర్, మైనార్టీ సెల్ ఇమామ్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శెట్టిపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం జరుగుతుందని పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్ తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

సోమందేపల్లి: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సూచించారు. మంగళవారం మండలంలోని జూలకుంట గ్రామంలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సాధక బాధలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, సర్పంచ్ సోము, వైస్ సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, నాయకులు సంజీవరాయుడు, ఆంజనేయులు, శ్రీకాంత్, నాగరాజు, చంద్ర, నరసింహమూర్తి, హనుమంతరాయుడు, జయరాం, మారుతీ, ప్రభాకర్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కనీస మద్దతు ధరతో రాగుల కొనుగోలు

హిందూపురం: రబీ సీజన్‌లో రాగి పంటను సాగు చేసిన రైతులు వద్ద నుంచి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా కనీస మద్దతు ధర క్వింటా రూ.4,290తో రాగులు కొనుగోలు చేస్తామని హిందూపురం సహాయ వ్యవసాయ సంచాలకులు జీఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. మండల పరిధిలో సాగులో ఉన్న రాగి పంట దిగుబడిని వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు.

రాగిపంట పరిశీలన

గుడిబండ: బోరుబావుల్లో నీటి వసతి కలిగిన రైతులు ఎక్కువ విస్తీర్ణంలో రాగి పంటను సాగు చేయాలని వెంకటేష్, ఏడీఏ కృష్ణమీనన్ పేర్కొన్నారు. మంగళవారం గుడిబండ మండల కేంద్రంలో 34 మంది రైతుల రాగి పంటను పరిశీలించారు. రసాయన ఎరువులు సిఫారస్సు మేరకే వాడాలని సూచించారు. ఏఓ తిమ్మప్ప, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం

హిందూపురం టౌన్: మున్సిపల్ పరిధిలోని లోటస్ పాఠశాల ఆవరణలో మంగళవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జీవిత, తన్విత రెడ్డిలకు గ్రీన్ బెల్ట్, మేఘన, జాహ్నవి, తనుషలు ఆరెంజ్ బెల్ట్, పావని ఎల్లో బెల్ట్‌లను అందించారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణ , మాస్టర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

రొళ్ల: మండల పరిధిలోని కాకి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.4,300 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతు విద్యార్థులు చదవుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌ప్రసాద్, అలుపనపల్లి హెచ్‌ఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా గుమ్మన్న డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అయితే డెప్యుటేషన్ రద్దు కావడంతో మంగళవారం ఉన్నత పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

లెనిన్‌ను ఘన నివాళి

పెనుకొండ: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ లెనిన్ జయంతిని ఘనంగా జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ ప్రపంచానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని ఆచరణ ద్వారా నిరూపించిన కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్త కామ్రేడ్ లెనిన్ పేర్కొన్నారు. అంతకు ముందు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరి, బాబావలి, గంగాధర్, మహబూబ్‌భాష, బావమ్మ, తిప్పన్న, ఉత్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడండి

అమరాపురం: గ్రామాల్లోని రైతులు తమ పొలాలకు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మీనరసప్ప తదితరులు తెలిపారు. మంగళవారం సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, మూత్రం, బెల్లం మోతాదులో కలిపి ఏ విధంగా జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చో వివరించారు. జీవామృతాన్ని చెట్లకు వేయడం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

జనివారాలను తొలగించడం సరికాదు

పావగడ: సీఈటీ పరీక్షల్లో పరీక్షలు రాయడానికి ముందు బ్రాహ్మణ విద్యార్థుల జనివారాలు (యజ్ఞోపవీతం) తొలగించి పరీక్షలు రాయించిన తీరు బ్రాహ్మణ ధర్మానికి అవమానకరమని స్థానిక తాలూకా బ్రాహ్మణ సభ అధ్యక్షుడు విశ్వనాథ్ అన్నారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట విద్యాశాఖ అధికారుల వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకొని, ప్రభుత్వం వెంటనే వారికి మళ్లీ పరీక్ష నిర్వహించాలన్నారు.


పావగడ నియోజకవర్గం దొమ్మతమరిలో..


లేపాక్షిలో: జ్యోతులు మోస్తున్న మహిళలు

వైభవంగా జ్యోతుల ఉత్సవం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వడిసిలమ్మ, గౌడు సంద్ర మారెమ్మలకు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా హరేసముద్రానికి తీసుకొచ్చి అమ్మవార్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవికి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జ్యోతులు మోశారు. జ్యోతులతో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, గ్రామస్తులు అమ్మవారి దేవాలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.


మడకశిరలో..

పావగడ: నియోజకవర్గంలోని దొమ్మతమరిలో నూతనంగా వెలసిన సొప్పులమ్మదేవి ఆలయంలో మంగళవారం భక్తులు అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. జాతరతో పాటు నూతన దేవాలయ ప్రారంభోత్సవం ఒకే రోజు నిర్వహించడంతో గ్రామంలో సందడి నెలకొంది.